# 'మా నాన్న'

సత్యవతి

"అంతా నాన్నని పిలుస్తారు. మానాన్న యేడే అమ్మా!"

"తెలివితక్కువచేత తాతయ్యా అమ్మమ్మా నేనూ మీ నాన్నతో పోట్లాడాము నీ పుటకలకు. అప్పటి నుంచీ మీ నాన్న దూరమైపోయినారు. గీత వుంటే మళ్లీ యెప్పటికైనా కలుస్తామేమో!"

ఇంట్లో మాట్లాడుకునే ధోరణి వింటూంటే మా నాన్నగారు మంచివారనీ, తెలివికలవారనీ, చేతులార కాపురం పాడుచేసుకుని మా అమ్మ పుట్టింటికి చేరిందనీ తోచేది. ఎవరైనా బంధువులూ, యెరిగినవాళ్లూ యింటికి వస్తే నాన్నమాట వచ్చేది. అప్పటి ప్రసంగాలు మరోవిధంగా వుండేవి. వాటిని వింటే నాన్న చెడ్డవాడనిపించేది. ఎప్పటికైనా కలిస్తే నిజం తెలుస్తుందని ఉవ్విళ్లూరుతూ వుండేదాన్ని.

అదృష్టంవల్ల మా మేనత్త చూడ్డానికి వచ్చింది. ఎప్పుడూ చింపితలతో మొఘాన బొట్టు లేకుండా పిచ్చిదానల్లె వకమూల కూచునే మా అమ్మ ఉత్సాహంతో అత్తయ్యతో మాట్లాడుతూ, "మీ నాన్న యిట్లాగే వుంటారు" అని హెచ్చరించింది.

అత్తయ్య ప్రేమతో నన్ను దగ్గిరికి తీసుకుని "అంత తెలివిగల మీనాన్న వుండిన్నీ మీ గతి యిల్లా వున్నది" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది. "అత్తయ్యా! మా నాన్నను చూపించవూ" అని బిక్క మొగంతో నే నడిగేటప్పటికి హృదయం కరిగి "సరే, అల్లాగే" అని మాట దక్కించుకుంది. మాఅమ్మ, అత్తయ్య చాలాసేపు గుసగుసలాడారు. మా అమ్మమ్మకూడా మర్యాదగా మాట్లాడి పంపింది.

తర్వాత వకనాడు బళ్లోనించి వచ్చి పుస్తకాలు సర్దుతుండగా, "పిల్లలను తీసుకుని వెంటనే బయలుదేరి రా" అని టెలిగ్రాం వచ్చింది. మా అక్కయ్య వూళ్లోలేకుండా వెళ్లాలిసొచ్చిందే అని మనస్సుకు కొంచెం కష్టమేసింది. ఆ రాత్రిరైలుకే నేనూ, మా అమ్మా, బట్టలు సర్దుకుని మూటకట్టుకొని బయలుదేరాం. అమ్మమ్మా తాతయ్యా కళ్లనీళ్లు కారుస్తూ సాగనంపారు. అమ్మ వాలకం చూస్తే బలవంతంగా ప్రయాణంచేస్తూన్నట్టు తోచింది. తెల్లారు జామున అత్తయ్యగారివూరు చేరాం. వెతుక్కుంటూ యిల్లు కనుక్కునేప్పటికి తూర్పు తెల్లారుతున్నది. ఇంట్లోకి వెళ్లేప్పునా, మా అమ్మ యెందుకో జంకుతూ బయట నిలబడి కబురంపింది. మా అత్తయ్య బయటికి వచ్చి ప్రేమతో నన్ను దగ్గిరికి తీసి మమ్మల్ని లోపలికి తీసుకెళ్లింది. లోపలి కెళ్లింతరువాత వెంటనే యిట్లా అంది "అన్నయ్య షికారుకెళ్లారు! అధికప్రసంగం చెయ్యక నీవు చెప్పదలిచినవన్నీ మా అన్నయ్య మనస్సు కెక్కేటట్టు చెప్పకో. ఇదివరకుమల్లె తెలివితక్కువగా ప్రవర్తించకు."

మా అమ్మ "ఆయనమొఘం చూట్టానికి నాకు భయంచేత యిన్నాళ్లూ పుట్టింట నానామాటలూ పడుతూ పడున్నా. పిల్లల్ని ఆయన కొప్పచెప్పదామని ధైర్యంచేసుకు వొచ్చా. వదినా! నీమేలెన్నటికీ మరవను" అన్నదో లేదో యింతలో వచ్చాడయ్యా ధూకుడుగా వకాయన. మాఅత్తయ్య నన్నూ అమ్మనీ పక్కగదిలో కెళ్లమని సంజ్ఞచేసింది. అప్పుడనుకున్నా యీన మా నాన్నని. మే మిద్దరం గదిలో నక్కేం. ఎందుకో యింతభయం నాకు తెలియదు.

"వంట అయిందా? బావ వచ్చాడా? ఆకలవుతున్నది వడ్డించు" అంటూ వంటింటిలో కొచ్చి పీటమీద కూచున్నాడు మానాన్న. కూచుని వూరుకోక కమ్మనికబుర్లు చెప్పటం మొదలెట్టేటప్పటికల్లా మా నాన్న మంచి చురుకైనవాడనీ, యితరుల మనస్సులను ఆనందింపజేయగలవాడనీ తెలిసింది. ప్రథమదర్శనం నా కాయనమీద అపేక్షను పుట్టించింది. మామయ్య

గారు త్వరగా భోంచేసి చెయ్యి కడుక్కుని నన్నాయన దగ్గిరికి పంపాడు. నాన్నగారిని చూడగానే ఆయన వొళ్లో కూర్చోవా లనిపించిందిగాని మనస్సులో, మళ్లీ యెందుకో అట్లా చెయ్యలేకపోయినా. నుంచున్నా. మెరిసేకళ్లు, చిరునవ్వు చిందులు తొణికే పెదవులు, బూరెల్లాంటి బుగ్గలు, ఆనందాన్ని వెల్లడించేమొఘము చూచి, తప్పక నన్నాదరణతో ప్రేమిస్తారని అనుకున్నా. నావంక చూశాడుగాని నన్ను గుర్తుపట్టలా. తన మాటలధోరణిలోనే పది నిమిషా లున్నాడు.

"ఆ అమ్మాయి యెవరో వచ్చి చాలాసేపటినుంచి నిల్చున్నది. కూర్చో మనవేమమ్మా చిట్టితల్లి!" అనగానే "మీ అమ్మాయే! వదినెకూడా వచ్చింది. నిన్ను క్షమాపణ కోరుకుంటుందట! ఆమె చెప్పేదంతా విను. పిల్లల్ని మరవకు. వాళ్లను వృద్ధిలోకి తీసుకు రావడం నీ ధర్మం" అని అత్తయ్య గంభీరంగా జవాబు చెప్పింది. నాన్నగారు అత్తయ్యవంక తీక్ష్ణంగా చూస్తూ, "నాతో సంప్రదించకుండా, నాకు తెలియకుండా వాళ్లనెందుకు రానిచ్చావు? ఎంత పొరపాటు చేశావు?" అని భోజనందగ్గిరనుంచి లేచి గదిలోకెళ్లి అత్తయ్యను మామయ్యను పిల్చి చాలాసేపు మాట్లాడాడు. తర్వాత వంటరిగా పది నిమిషాలు తన మనస్సులో తాను ఆలోచించుకుని "సరే మాట్లాడుతా"నన్నాడు కాబోలు. మామయ్య తనతో నన్నుకూడా గదిలోకి తీసికెళ్లి కూర్చోపెట్టాడు. వెంటనే ప్రశ్న పరంపరలు. "నీ పేరేమి? ఏమి చదువుతున్నావు? మీ అమ్మపేరేమి? మీ నాన్న పేరేమి? ఎప్పుడైనా మీ నాన్నను చూశావా? చూడా లనిపించిందా?" నదురు బెదురు లేకుండా నేనూ ఘాటుగా జవాబులు చెప్పేటప్పటికి నిర్ఘాంతపడిపోయి నాన్నగారు, "అన్నం తిని నిద్దరపో. రేపు సావకాశంగా యింకా మాట్లాడుదాం" అని నన్ను పంపారు. సావిట్లో సిద్ధంగావున్న అమ్మ మాట్లాడటానికి లోపలికి తయారైతే "మీ భోజనాలైన తర్వాత" అని నాన్నగారివద్దనుంచి ఖంగున జవాబు వచ్చింది. నేను భయం లేకుండా ధైర్యంగా జవాబులు చెప్పినందుకు మా అత్తయ్య నన్ను మెచ్చుకున్నది. అన్నం తిని నిద్దరపోయా.

మర్నాడు నేను లేచేటప్పటికల్లా మా నాన్నగారు స్నానం చేసి పూజచేసుకుంటున్నారు. అది చూసేటప్పటికి ఆయన దైవభక్తి కలవా రనిన్నీ, నన్నూ మా అక్కయ్యనూ తప్పక ఆదరణతో చూస్తారనిన్నీ తోచింది. కాలకృత్యాలు తీర్చుకుని నేను సిద్ధమయ్యేటప్పటికి పూజనుంచి లేచారు. అప్పుడు నన్ను దగ్గిరికి పిల్చి వొళ్లో కూచోబెట్టుకొని తల నిమురుతూ ముద్దుపెట్టుకుంటే నాకు యెన్నడూ యెరగని ఆనందం కలిగింది. ఎన్నడూ నేనంత సంతోషం యెరగను. మనస్సు యెట్లాగో వుంది. నే నప్పుడు మా నాన్నగారి భుజాలమీద చేతులు వేసి కండ్లల్లోకి చూస్తూ,

"నాన్నగారూ! మీదగ్గి రుంటా. చాలా ఆనందంగా ఉంది. మిమ్మల్ని చూచినప్పటినుంచీ మిమ్మల్ని విడిచిపెట్టా లని లేదు" అన్నాను.

"తల్లీ! నాకుకూడా అలాగే వున్నదమ్మా! త్వరలోనే నాదగ్గిర వుంచుకునే ప్రయత్నం చేస్తాలే" అంటూ నామీద ముద్దులవర్షం కురిపించారు. ఇదివరకు నేను చూస్తున్న ముఖాల్లాగ తుమ్మల్లో ప్రొద్దు గూకినట్టుగాక అక్కడ మావాళ్ల యింట్లో అన్ని ముఖాలూ చాలా వికాసంగా వున్నాయి. నాన్నగారు బజారు కెళ్లి చాలా రకాల పండ్లు తెచ్చారు. అత్తయ్య పిండివంటలుచేసింది. ఎన్నడూ నే నెరగని ఆదరణతో చూస్తూవుండేది. రెండు పరికిణీలు, రెండుజాకెట్లు కుట్టిచ్చింది. వాళ్లలో వుండాలని పించింది. అక్కడినుంచి పోబుద్ధిపుట్టలా.

నాన్నగారు మర్నాడు ప్రయాణానికి సిద్ధమై నన్ను ముద్దాడి, "త్వరగానే కలుసుకుని మనమందర మొకచోట వుందాము. ధైర్యంగా వుండు" అని వెళ్లారు నా హృదయంలో నివాస మేర్పరచుకుని. తర్వాత రోజూ నాన్నగారిదగ్గిరనుంచి వుత్తరాలు వస్తూవుండేవి. ఆ వుత్తరాలుచదువుతూంటే నాన్నగారు కండ్లయెదట మాట్లాడుతున్నట్టనిపించేది. ఇట్లా నా కాయనమీద ప్రేమ అభివృద్ధి అయింది. వకనాడు మా అమ్మ అత్తయ్యతో, "మా అమ్మ పని చెయ్యనియ్యక గారాబంగా దద్దమ్మల్లే కూచోబెడుతుంది. ఇక్కడుండి పని నేర్చుకోవాలని వుంది" అన్నది.

"వదినా! మిమ్మల్నిద్దరినీ కలపగలిగా. అన్నయ్య దగ్గిర కెళ్లిందాకా యిక్కడే వుండి పని నేర్చుకో సుఖంగా. ఏమీ అభ్యంతరం లేదు. కాని మీవాళ్లసాధ్యులు. మా యింటిమీదికి పోట్లాట కొస్తే నాచేత గాదమ్మా" అన్నది మా అత్తయ్య. మా యింట్లో మాట్లాడుకునే మాటలల్లేగాక యిక్కడ మాట్లాడుకునే మాటలు నాన్నగారి యెడల గౌరవాన్ని, ప్రేమను పుట్టించాయి.

"ఇంతశాంతంగా నా మొర వింటారని తెలిస్తే యిదివర కెప్పుడో వచ్చేదాన్ని. చెప్పేదంతా విని తిరిగీ ప్రశ్నలు వేస్తే జవాబు చెప్పలేకపోయినా. వాళ్లూ వీళ్లూ చెప్పిన సలహాలమీద వారితో పోట్లాడి కాపురాన్ని పాడుచేసుకున్నా" అంటూ కళ్లనీళ్లు పెట్టుకుంది మా అమ్మ.

"అయినదానికి దుఃఖించకు. పిల్లను చూచేటప్పటికి ముచ్చటపడ్డాడు. ఇప్పుడైనా కాపురం తెలివిగా నిలబెట్టుకో, సుఖపడతావు. లేదా యథాప్రకారం పుట్టిల్లూ చీవాట్లే గతి" అని వోదార్చింది మా అత్తయ్య. ఒకటికి నాలుగుమాట్లు చెప్పతూ, చేతగాని పని చేసి చూపిస్తూ మా అమ్మకు పనినేర్పి మాయందు శ్రద్ధ తీసుకున్నది మా అత్తయ్య. దాదాపు నెలదినాలు గడిచాయి. ఒకనాడు మా నాన్నగారు రాసిన వుత్తరంలో మంచిరోజుగా చూసుకొని రావచ్చునని రాశారు. ఆ వుత్తరం చూసి నా వొళ్లు, హృదయం పొంగిపోయింది. ఎందుచేతనో అమ్మ నిర్ఘాంతపడి తెల్లబోయి చూసింది. అప్పుడు అత్తయ్యా మామయ్యా మా అమ్మకు బుద్ధులు చెప్పి మమ్మల్ని సాగనంపారు.

పట్నం చేరేటప్పటికల్లా నాన్నగారు ప్లాటుఫారంమీద సిద్ధంగా వున్నారు. ఆయనపైకి వక్కగం తేసి వురికా. కౌగిట్లో చేర్చుకుని ముద్దాడి అబ్బరంగా తన నివాసానికి తీసుకుని పోయారు. ఒకటి రెండు దినాలు గడిచాయి. ఇంట్లో యేమీ తక్కువలేదు. అన్నీ సమృద్ధిగా వుండేవి. క్రమంగా మా అమ్మకు మా అత్తయ్యగారింట్లో వుండే చురుకుదనం తగ్గింది. పూర్వం మళ్లేప్రవర్తన ఆరంభించింది. నాన్నగారు పాపం కోపం యెంతమాత్రం లేకుండా, "త్వరగా నిద్రలే. కాలకృత్యాలు తీర్చుకుని, తలదువ్వుకొని, నీళ్లుపోసుకొని, బొట్టు పెట్టుకొని, వంటచెయ్యి, మనం సుఖంగా వుండచ్చు. ఇక్కడ యెవ్వరు నిన్ను ఆరళ్లు పెట్టేవాళ్లెవ్వరూ లేరు. వేగిరం పనిలోకి ఛూకు" అంటూ పని చెయ్యమని ప్రేరణచేసేవారు ఏమీ ప్రయోజనం లేకపోయింది. ఇంకా, "పోనీలే! పాపం! యింతకాలం తల్లిదండ్రుల వద్ద సుఖంగా వుండి పనీపాటూ యేమీ చెయ్యకుండా వున్నావు. వెంటనే అన్నీ నేర్చుకోటం కష్టం. వక్క వారం పనులన్నీ నేను చేస్తూవుంటాను. శ్రద్ధగా గమనిస్తూవుండు. తరువాత చేద్దువుగాని" అని పనంతా తానే చేస్తూ పని నేర్చుకోటానికి ప్రేరేపించేవారు. ఇందువల్లకూడా ఆమె యెంతమాత్రం మారలేదు. నాన్నగారు పనంతా తాను చేసుకుంటూంటే పోనీ తన తల దువ్వుకోడం మొదలైన స్వంతపనులైనా చేసుకోవచ్చునా, అదీ లేదు. ఏవేళకూ నిద్రలేవక, అప్పుడప్పుడు కబుర్లాడుతూ, ప్రశ్నిస్తే జవాబు చెప్పలేక తలవంచుకునేది.

"మీ అమ్మకు అన్నీ నిజం చెప్పావా? పెద్దమ్మాయిని కడుపుతో వున్నప్పుడు నాతో పోట్లాడి వెళ్లినసైనం వాళ్లకు తెలుసునా? భర్త కలెక్టరు, జడ్జి అయితేనే నేను పనిచేస్తానన్నావని వాళ్లకు తెలుసునా?" అన్నారు నాన్నగారొకరోజు.

"అన్నీ చెపుతానాయేమిటి? ఇప్పటికే వాళ్లనేమాటలు వినలేకుండావున్నాను. సంగతులన్నీ చెపితే పూడ్చి ఉప్పునీళ్లు చల్లుతారు" అన్నది మాఅమ్మ.

"తెలివితక్కువదానివి. చెప్పితే వాళ్లకు నీమీదున్నప్రేమకు తలన్నా తాకట్టుపెట్టి, యేకలెక్టరునో, యేజడ్జినో నీకు తగినవాడిని తీసుకొచ్చి నిన్ను సుఖపెట్టేవాళ్లుగా!"

"ఈ జన్మకింతే"

"ముందు జన్మలోనైనా నీకోరిక యీడేరునేమోలే!"

ఇట్లా పరస్పరం అయిష్టసంభాషణలు జరుగుతూండేవి.

ఒక రోజున నాన్నగారు వంట చేసుకుంటున్నారు. ఆయనకు పాపం! సహాయం చెయ్యకుండా సోది మొదలెట్టింది.

“మన అమ్మాయి పెళ్లి వైభవంగా చెయ్యాలె, నాల్గువేలైనా ఖర్చుపెట్టి. సిద్ధంగా వున్నారా?”

“చిన్నతల్లి వృద్ధిలోకి రావాలెగాని అంతకంటె యెక్కువకూడా ఖర్చుపెట్టడానికి సిద్ధంగా వున్నాను. బాగా చదువు చెప్పిస్తాను. పెండ్లి కిప్పుడేం తొందరొచ్చింది?”

మానాన్నగారిజవాబు నాకెంతో నచ్చింది. అమ్మమొగం చూసేటప్పటికామె కాజవాబు అసంతృప్తి కల్గినట్టు తెలిసింది.

ఇట్లా కొన్నాళ్లు గడిచాయి. “వంటా, పెట్టా భారం వహించమని దినామూ చెపుతూవుండేవారు. ఒకనాడు వంటచెయ్యమని చెప్పివెళ్లారు. అమ్మతోటలో చెట్లవంకా ఆకాశంవంకా చూస్తూ కాలం గడుపుతూంటే, “త్వరగా నిప్పు రాజేసి వంట చెయ్యి. నాన్నగారు వచ్చేటప్పటికి వంట సిద్ధంగా లేకపోతే కోపం వస్తుందేమో!” అన్నాను.

“కావలసినవాళ్లు చేసుకు తింటారు” అన్నది.

“ఇట్లా అయితే నాన్నగారివద్ద యెక్కువకాలం వుండలేవు సుమా! నీసంగతి క్రమంగా బయటపడుతున్నది. నేనూ మా అక్కయ్యా నాన్నగారి దగ్గిరుండి హాయిగా చదువుకుంటాం. నీవు నీ పుట్టిల్లు చేరుకోవలసిందే!” అనేటప్పటికి నా చెంపమీద ఛెళ్లని వకదెబ్బ కొట్టింది. నేను యేడుస్తూంటే నాన్నగారు గబగబ “వడ్డించూ” అంటూ లోపలికొచ్చారు. నే నేడవడం చూసి అడిగితే, జరిగినవిషయమంతా చెప్పా. అప్పుడు నన్ను ఊరడించి యెత్తుకుని ముద్దాడి అమ్మతో బెదరిస్తూ,

“వంట యెందుకని సిద్ధం చెయ్యలేదు? ఎప్పుడూ యింక అమ్మాయిని కొట్టవుకదా!” అని చెవి పట్టుకుని సాగదీశారు.

“హాయిగా మా అమ్మ వండిపెడుతూంటే తిని కూర్చోలేక యిక్కడికొచ్చాను. నేను చెయ్యలేను. మమ్మల్ని పంపించండి పోతాం” అన్నది మాఅమ్మ తీవ్రంగా.

“అనమస్తురాలవు. ఉన్నచోట పడుండకుండా హఠాత్తుగా వచ్చి నాకాళ్లమీ దెందుకు పడ్డావు మరి? అమ్మాయిని చూసి ప్రేమకలిగి యిక్కడికి రప్పించాను. నీకు నామీద ప్రేమ యెంతమాత్రం లేదని నాకిదివరకే తెలుసు. మా అమ్మాయిగారింట్లో ఆవాళ రాత్రికూడా నీ కళ్లల్లో చూస్తే యెంతమాత్రం నీకు పశ్చాత్తాపం కలిగినట్టు తోచలేదు. అమ్మాయియోగక్షేమమైనా ఆలోచించి యికనైనా కుదురుగా వుండు” అని మానాన్న మందలించారు. తానే వంటచేసుకుంటూ కాలం గడుపుతూండేవారు. ఒకరోజున నేను నాన్నగారికి సహాయం చెయ్యటానికి పోయేటప్పటికి నాచెయ్యి కాలింది. “తల్లీ! చిన్నదానివమ్మా! నీవు వంటలోకి రాకు” అంటూ ప్రేమతో నన్ను వారించారు. అమ్మచేసేపనులన్నీ అవకతవక. వస్తువులన్నీ నట్టింటఅమిర్చేది. నాన్నగారికాళ్లు చేతులకడ్డం. నాన్నగారు కోపంతో విసుక్కోడం పరిపాటైంది. మేము వెళ్లి యింకా నెలదినాలు కాలేదు. ఒకరోజు తలుపులన్నీ తీసిపెట్టింది. ఇల్లు దొంగలకు బెట్టింది. దాదాపు వందరూపాయల సామానులు నష్టమైనాయి. నాన్న వచ్చేటప్పటికి శోకాలు పెడుతూ కూచున్నది. అప్పుడు నాన్నగారు బహుశాంతంగా వోదార్చారు. “నేను బంగారం పట్టుకుంటే మన్నవుతున్నది. మీదగ్గిర నేనుండతగను. మమ్మల్ని మావాళ్లింటికి పంపండి” అంటూ యేడ్చింది అమ్మ.

“పొరపాటున తలుపులు తాళాలు వెయ్యకపోతే దొంగలు వచ్చి సొమ్మెత్తుకెళ్లారు అందుకని నిన్ను నేను వేధించటంలేదు. జాగ్రత్త, చురుకుతనం అలవాటు చేసుకునిపనిపాటులు చేసుకుంటూంటే చాలు”అన్నాడు నాన్న. సొమ్ము పోయినా యింత శాంతంగా వుండడం చూచి నా కాశ్చర్యమేసింది. ఇట్లా యెప్పుడూ బుద్ధులు చెప్పుతున్నా, మాఅమ్మ తన్ను తిట్టుకోడం నాన్నగారిని యింకా విసికించడం సాగించింది. ఓ నాడు, “మీరమ్మాయిపెండ్లి నాయిష్టప్రకారం చెయ్యక పోయినారా, మావాళ్ల యిష్టానుసారం, యెటువంటి వెధవైనాసరే నా రెండోతమ్ముడి కిచ్చి ముడేస్తాను వెనక మీకు తెలియకుండా పెద్దమ్మాయికి వివాహం చెయ్యడం వల్ల దానితల చెడింది. ఈమాటు మాఅమ్మ పట్టుపట్టింది. ఎట్లాగైనా మిమ్మల్ని లాంగదీసి పీటలమీద కూర్చుంపబెటుతుంది” అనేటప్పటికి నాన్నగారు కళ్లెఱ్ఱచేసి,

"మీ అమ్మపట్టు మీ నాన్నదగ్గిర. వెనుక నాతో పట్టు సాగించుకొమ్మని నీకు సలహాయిచ్చి సాగించుకో లేక, కథ యెదురు తిరగడం మరచిపోయి మళ్లీ నిన్ను యింకు కని పంపిందా యేం? ఇంకా మూఢత్వం వదల్లా? యాత్రలు చేసిందానిఫలం యిదేనా? తమో గుణం యెక్కువైందే? ఇకమీద యిట్లాంటి అనవసర ప్రసంగం నావద్ద తేవద్దు" అని గట్టిగా చెప్పాడు.

నాకు పాఠాలు చెప్పడం, పట్నమంతా చూపించడం నాన్నగారికి సర్దా. వారికి చాలామంది స్నేహితు లున్నారు. వాళ్లు తరుచు విందులకు పిలుస్తూండేవాళ్లు. నేనుకూడా వెళ్లేదాన్ని. నన్ను వాళ్లు చాలా ప్రేమగాను మర్యాదగాను చూశేవాళ్లు. ఇక్కడుంటే అంతా నాకు స్వర్గంలాగుం దని మా అక్కయ్యకు వ్రాశా. ఏది కావాలంటే అది వెంటనే కొనిచ్చేవారు నాన్నగారు. ఇక్కడే వుండాలని నాకు గట్టిగా వుండడంవల్ల ఓనాడు అమ్మను, "వెళ్లకు. వంటచేసిపెడితే తమదోవన తాము పోతారు నాన్నగారు. శ్రద్ధగా పని చెయ్యి. మన మిక్కడేవుందాం" అని బతిమాలుకున్నా.

"ఈ వెధవకూరలు, మిఠాయిలు నాకేం అంత బాగా లేవు. ఇక్కడికి వచ్చింతరువాత హాయిగా యింత గోంగూర, చింతకాయ, ఖారం వేసుకుని, కమ్మగా చేసిపెడితే సుఖపడలేక యెరక్కపోయి యిక్కడికి వచ్చా. మనం అమ్మమ్మగారింటికి పోవాలసిందే" అన్నది.

"నువ్వుపో, నేను రాను. నీమూలకంగా అక్కయ్యా నేనూకూడా చెడిపోతాం. ఇక్కడ వుంటే మేము తప్పక వృద్ధిలో కొస్తాం."

ఈ సంభాషణతర్వాత అమ్మతో యెక్కువగా మాట్లాడటం మానేశాను. పిలుస్తేకూడా వినిపించుకోకుండా వుండేదాన్ని. ప్రతిదినం తనను పుట్టింటికి పంపమని నాన్నగారితో పోరుతూండేది. వారు యీకథ కట్టిపెట్ట మంటూండేవారు. ఇట్లావుంటూ వుండగా ఓరోజున,

"నన్ను యెందుకూ పనికిరాని పిచ్చిదానికింద కట్టి పిల్లలను మొగరాయుళ్లలాగు చదువు చెప్పించి తయారు చెయ్యా లనుకుంటున్నారూ? పిల్లలను మీకు ధారాదత్తం చేస్తా ననుకున్నారేమో? ఎట్లా వచ్చానో అట్లా వెళతా. అడ్డు చెప్పారా, భావిలో దూకి మిమ్మల్ని సకలయిబ్బందులూ పెట్టకపోతే మారుపేరుపెట్టండి" అన్నది. అనగానే నాన్నగారు తోకతొక్కినతాచల్లే లేచి,

"ఇట్లాంటి మొండిదానివి మళ్లీ యెందుకొచ్చావు? వెనకోమాటు భావిలో పడతానంటే అయినశాస్తి మరిచిపోయావా? మీఅమ్మ మంచివిద్య నేర్పి పంపింది. చావ తెలుచుకున్నదానివి మీవాళ్లయింట్లో భావిలోనే దూకలేక పోయావు? ఇట్లాంటిదానివి నాదగ్గిర వుండతగవు. తక్షణం నాగడపదాటు! ఇదిమూడోమాటు! నా నెత్తురు నానోట పోసికొట్టావు. పో! వెళ్లిపో!"అని గట్టిగా అరిచారు. అందరికంటె బలవంతుడు రాజు. రాజుకంటె బలవంతుడు మొండివాడు. అత్యంతమైన ఆవేశం వచ్చి నాన్నగారు దాన్ని భరించలేక నేలమీద మూర్ఛవచ్చినట్టు పడిపోయారు. అట్లాంటిస్థితిలో యెట్టి మనస్సంకోచం లేకుండా నేను రానని రాగాలుపెడుతూంటేకూడా వినకుండా నన్నుయీడ్చుకుని స్టేషను చేరింది. నాన్నగారు స్టేషనుకు వస్తా రనుకున్నాగాని రాలేదు. మళ్లీ వెనక గానుగలోనే పడ్డాం.

నాన్నగారిమీద అన్నీ అబద్ధాలు కల్పించి వాళ్ల వాళ్లతో చెప్పింది. నేను జరిగింది జరిగినట్లు అంతా నిజం చెప్పా. అదివిని, "శుభ్రంగా కాపరంచేసుకోక మళ్లీ మాపాలబడ్డావూ?" అని నిందించారు. బైట మొగంపెట్టలేక యెప్పుడూ యింట్లో మూలబడుండేది. కొన్నాళ్లకు మా అక్కయ్య వచ్చింది. నేను జరిగిందంతా చెప్పా. మా నాన్నగారిదగ్గిర కెళ్లి చదుకుని వృద్ధిలోకి రావాలని తీర్మానించుకున్నాం.మానాన్నగారు మళ్లీ వకమారువస్తే తీసుకెళ్లటానికి వీల్లేదని ఆయ న్నడ్డగించారు. శారదాచట్టము సవరణ కాబడ్డ యీరోజుల్లోకూడా యేఅర్ధరాత్రో నాకు ముడెయ్యాలని పన్నాగం పన్నారు. మాఅక్కయ్యమల్లె నాకుకూడా మానాన్నకు తెలియకుండా మా మామయ్య కిచ్చి పెళ్లి చెయ్యాలని ముసిలాళ్ల పట్టు. మమ్మల్నొకమా రడిగేటప్పటికి మాకు యిష్టం లేదని చెప్పాం. అప్పుడా తెల్లమొఖంవాడు నా కెందుకి

బలవంతప్పెళ్లి అని తెలివితెచ్చుకుని యెక్కడికో దూసుకున్నాడు. నే నెక్కడ పెద్దమనిషినౌతానో, వాళ్ల కొంప కూలిపోతుందని భయపడుతూండేవాళ్లు. విద్యా వికాసాలు లేక మొండిపట్టు పడితే సంసారాలు ధ్వంసం కావూ? లేనివాళ్లు లే కేడుస్తూంటే ఉన్నవాళ్లపని యిట్లా వున్నది. మా కిద్దరికీ మళ్లిమీ దున్నట్టుండేది. ఏనాటికైనా బాకీ తీర్చుకొని మా నాన్నగారివద్ద చేరి హాయిగా చదువుకుని వృద్ధిలోని వస్తామా అని ఆ దుర్దా పడుతూ నిమిష మొక యుగంగా గడుపుతున్నాం.

ఇట్లా వుండగా ఒకనాడు మా నాన్నగారు యింకా యిద్దరు పెద్దమనుష్యులు వచ్చి మావాళ్లవాకిట్లో బండి నిలిపి మమ్మల్ని పిల్చారు. మాఅక్కయ్యకూ నాకూ ప్రాణాలు లేచొచ్చినై. మమ్మ ల్నిద్దర్ని బుజ్జగించి ముద్దుపెట్టుకుని మీఅమ్మ వస్తుందేమో అడిగిరమ్మన్నారు. ఇట్లా మాఅమ్మతో చెప్పేటప్పటికి మూతి ముడుచుకొని వాకిట్లోకైనా రాలేదు. మా అమ్మమ్మ తాతయ్యా యింట్లో లేరు. మమ్మల్ని తీసుకుని వెళ్లిపోయారు. బళ్లో వేశారు. మేమే యిల్లు దిద్దేవాళ్లం. తరువాత యెన్నిసార్లు రమ్మన్నా మాఅమ్మ రాలేదు.

---

# రహస్య

దామెర రాజగోపాలరావు

శీత కలధౌత విమల విభాతవేళ,
కొండకోనను వికసించి కుసుమ మొండు,
పరిమళాహ్వానపత్రముల్ పరచె దెసల,
మంద మలయసమీరకుమారు చేత!

శ్రావ్య మోహన కోమల స్వరము నెత్తి,
మధురగానమ్ము సేయుచు మధురఫణితి,
కదలి రాలేదు ఒక్క షట్పదకుమారు
డేని, ఆనందమున అది యేమొ కాని!

కాటుకను ఉదాసించు చీకటులపటలి
రేపు మునిమాపు తలసూపు రీతి దోచె;
అంత ప్రసవమ్ము వసివాడి, కాంతితొఱగి,
రేకు లల్లనల్లన రాల్చి రిత్తవోయె!